క్లుప్తంగా

నేడు దోనుబాయి పరిధిలో ఎన్నికల ప్రచారం

సీతంపేట: మండలంలోని దోనుబాయి, పుబ్బాడ, గుజ్జి తదితర పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి శుక్రవారం ఎన్నికల ప్రచారం చేయనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాలకొండ రూరల్: స్థానిక విద్యుత్ ఉపకేంద్రంలో శుక్రవారం 33 కేవీ విద్యుత్ సరఫరా యాంత్రిక ఉపకరణాల నిర్వహణ చేపట్టనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ టీజీకే.మూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పాలకొండ పట్టణంలో ఆర్డీవో కార్యాలయ సమీప ప్రాంతాలతోపాటు, శ్రీకాకుళం రహదారిలో, బూర్జ మండల పరిధి డొంకలపర్త, హరిపురం, తుడ్డలి గ్రామాల్లో శుక్రవారం ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీ



ఇంటివద్దకు వెళ్లి వృద్ధులకు పింఛన్ అందిస్తున్న సచివాలయ సిబ్బంది

పాలకొండ: ప్రభుత్వం అందజేసే నెలవారీ పింఛన్ల పంపిణీకి తెలుగుదేశం పార్టీ వికృత చర్యలతో అడ్డుపడి వలంటీర్లను దూరం చేయడంతో వృద్ధులు, దివ్యాంగులు అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు గురువారం పింఛన్‌లను సచివాలయాల సిబ్బంది పంపిణీ చేశారు. దీంతో సచివాలయాల వద్దకు రావడానికి వృద్ధులు అవస్థలు పడ్డారు. మరి కొంతమంది వృద్ధుల ఇళ్లకు వెళ్లి సచివాలయ సిబ్బంది పింఛన్‌లు అందజేశారు. పాలకొండ నగరపంచాయతీలో 3,444 సామాజిక పింఛన్‌లు పంపిణీ చేయాల్సి ఉండగా గురువారం నాటికి 3,226 పింఛన్‌లు పంపిణీ చేశారు.

బాబాకు ప్రత్యేక పూజలు



హోమం పూజల్లో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం సాయిబాబాకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవ, జై గురుదత్త హోమాన్ని ఆలయ అర్చకుడు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

ఆదుకున్నారు..



జి.వెంకటాపురంలో వృద్ధుడికి పింఛన్ అందిస్తున్న అధికారులు

పాలకొండ రూరల్: అసలే వృద్ధాప్యం.. ఆపై ఆరోగ్యం సహకరించడం లేదు. పింఛన్ మొత్తంపై ఆధారపడుతున్నాను. ఈ నెల పింఛన్ అందక ఇబ్బందులు పడ్డాను. వలంటీర్లు ఉన్నప్పుడు ఎటువంటి సమస్యలు లేకుండా మా ఇంటివద్దకే తెచ్చి ఇచ్చేవారు. కదలలేని స్థితిలో సొమ్ము వస్తుందో లేదో తెలియక ఆందోళన పడ్డాను. జగన్‌బాబు మా కష్టం గుర్తించాడు. అధికారుల ఇంటికే అందించేలా చేశారు. నావలే అనేక మంది పింఛన్‌పై ఆధారపడి ధైర్యంగా బతుకుతున్నాం. మా లాంటివారిని ఇబ్బందులకు గురిచేసే పనులు సరికాదు. వలంటీర్ల స్థానంలో సచివాలయ సిబ్బంది పింఛన్ అందించకుంటే మా పరిస్థితి తలచుకుంటేనే భయమేస్తోందంటూ పాలకొండ మండలం జోలమడకు చెందిన పైల పారన్నాయుడు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలతో బుధవారం మధ్యాహ్నం నుంచి సచివాలయ సిబ్బంది నియోజకవర్గంలో పింఛన్ బట్వాడా వేగవంతం చేశారు. డివిజన్ కేంద్రం పాలకొండ మండలంలో 7,463 మంది వివిధ సామాజిక పింఛను లబ్ధిదారులు ఉండగా వీరిలో 6,628 మందికి పింఛన్ మొత్తం అందించారు. ఏజెన్సీ సీతంపేటలో 8,250 అర్హులు ఉండగా 7,150 మందికి పింఛను అందించారు. భామిని మండలంలో 7,109 మందిలో 5,358 మంది పింఛను పొందారు. వీరఘట్టం మండలంలో10,028 మందిలో 9,025 మందికి పింఛను అందించారు. నియోజకవర్గం మొత్తంగా 92 శాతం బట్వాడా జరిగింది.

సంక్షేమ పథకాల ప్రదాతకు పట్టం కడదాం



దుగ్గిలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కళావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు

- పాలకొండ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ఐదేళ్ల కాలంలో రామరాజ్యం స్థాపించి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వారి గడప వద్దనే అందించి అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసిన సంక్షేమ ప్రదాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆమె సీతంపేట మండలంలోని పొల్ల, మానాపురం, టిటుకుపాయి, దుగ్గి తదితర పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేశారు.

జగనన్నే మళ్లీ సీఎం

ప్రజలు అడుగడుగునా ఆమెకు నీరాజనం పలికారం. మా గ్రామాలకు మీరే మంచినీరు, రహదారి సౌకర్యం కల్పించారని దుగ్గి, కోసిమానుగూడ, మానాపురం, టిటుకుపాయి, కొత్తకోట తదితర గ్రామాల గిరిజనులు ఆనందం వ్యక్తం చేశారు. మళ్లీ జగనన్నే సీఎం అంటూ నినాదాలు చేశారు. మహిళలు హారతులతో ఆప్యాయంగా ఎమ్మెల్యే కళావతికి స్వాగతం పలికారు. ఇంటింటికి ఎమ్మెల్యేతో పాటు పార్టీ నాయకులు వెళ్లి ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఐదేళ్లుగా వలంటీర్‌లు ఇంటివద్దకే వెళ్లి పింఛన్ ఇస్తున్నారని, ఇప్పుడు చంద్రబాబు సకాలంలో పింఛన్‌లు లబ్ధిదారులకు అందకుండా అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. ఆయన బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని ప్రజలకు హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.సుమిత్రారావు, ఎంపీపీ బి.ఆదినారాయణ, ఏఎంసీ చైర్మన్ హెచ్.మోహన్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడులక్ష్మి, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.సాయి, ఎస్.సోమయ్య, ఎస్.కాంతారావు, రవి, కృష్ణ, వెంకటేష్, గాబ్రియల్, సర్పంచ్‌లు గంగారావు, ఎస్.అరుణ, బి.లక్ష్మి, వెంకునాయుడు, తిరుపతి, ఎంపీటీసీలు ఎస్.చంద్రశేఖరరావు, మంగయ్య, ఎస్.లక్ష్మి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు మజ్జిగ, నీరు పంచిన వలంటీర్లు



బాలేరులో పింఛన్ దారులకు మజ్జిగ, నీరు పంపిణీ చేస్తున్న వలంటీర్లు

భామిని: వృద్ధులు, వితంతతువులు, దివ్యాంగులకు పింఛన్లు పంచకుండా వలంటీర్లపై కుట్రచేసి ఆపించగలిగిన ప్రతిపక్షాలు, తమ అభిమానం, ఆప్యాయతలను ఆపలేవని గ్రామ వలంటీర్లు నిరూపించారు. ఈ మేరకు భామిని మండలంలోని బాలేరు -1 గ్రామ వలంటీర్లు పింఛన్లు అందుకోడానికి వచ్చిన పండుటాకులకు చల్లని మజ్జిగ, నీరు అందించి సేదదీర్చారు. ఇంటికి వచ్చి పింఛన్లు ఇవ్వలేం, కానీ మీ కష్టాల్లో భాగం పంచుకుంటామని వృద్ధులను సచివాలయం దగ్గరకు తీసుకువచ్చి చల్లదనం పంచారు. ఈ సందర్భంగా పెన్షనర్లు వలంటీర్లను అభినందించారు.

ఎన్నికల నియమావళి అమలుపై దృష్టిసారించాలి

పాలకొండ: ఎన్నికల నియమావళి అమలుపై దృష్టిసారించాలని తహసీల్దార్ వరహాలు కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామస్థాయిలో నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. అనుమతులు లేకండా ఎక్కడా బోర్డులు, జెండాలు ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రచారాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు. ఎన్నికల నియమావళిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పోలింగ్ బూత్‌లను నిత్యం పరిశీలించాలని ఆదేశించారు.

ఎమ్మెల్యే కళావతికి ఆదివాసీల మద్దతు



ఎమ్మెల్యే కళావతికి మద్దతు ప్రకటిస్తున్న ఆదివాసీ గిరిజనులు

భామిని: మండలంలోని మనుమకొండ గ్రామ ఆదివాసీ గిరిజనులు పాలకొండ శాసనసభ్యురాలు విశ్వాసరాయి కళావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ మేరకు గ్రామ సర్పంచ్ నిమ్మల కేశవ, ఎంపీటీసీ పత్తిక మురళి, మాజీ సర్పంచ్ నిమ్మల అన్నయ్య, పత్తిక సుగ్గుపర్మిల ఆధ్వర్యంలో గురువారం ఆదివాసీ మహిళలు సంప్రదాయ బద్ధంగా నృత్యాలు చేసి మూకుమ్మడిగా మద్దతు ప్రకటించారు.సంపూర్ణంగా అండగా ఉంటామని, సీఎం జగనన్నను గెలిపించుకుంటామంటూ ప్రతిజ్ఞ చేశారు. విద్యావంతుల గిరిజన గ్రామమైన మనుమకొండలో ఏకగ్రీవంగా సంపూర్ణ మద్దతు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

ఉపాధి పనుల పరిశీలన



జంపరకోటలో ఉపాధి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీవో

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవిలో ఉపాధి వేతనదారులకు ఇబ్బందుల్లేకుండా క్షేత్రసహాయకులు పనులు కల్పించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన పాలకొడ మండలంలోని జంపరకోట వద్ద జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకుని వృద్ధులు, దీర్ఘకాల ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న జాబ్‌కార్డుదారులకు పని ఇచ్చే విషయంలో తగు జాగ్రత్తలు వహించాలని ఈ సందర్భంగా సూచించారు. పని జరుగుతున్న చోట తాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని చెప్పారు. వేతనదారులు వీలైనంతవరకూ నీరు. పలుచని మజ్జిగ తీచ్చుకుంటే మంచిదన్నారు. ఎండ ధాటినుంచి ఉపశమనం పొందేందుకు టెంట్లు వేయాలని, వడదెబ్బపై అవగాహన కల్పించాలని, ప్రథమచికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందిని కోరారు.

వీరఘట్టంలో 90 శాతం పింఛన్ల పంపిణీ



వీరఘట్టం పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ల కోసం వచ్చిన వృద్ధులు



ఆర్‌సీఎం స్కూల్ వద్ద పింఛన్ కోసం ఎదురుచూసిన వృద్ధులు

వీరఘట్టం: వలంటీర్లు ప్రతి నెలా ఇంటికి పింఛన్ డబ్బులు తెస్తే అడుగు కదపకుండా పింఛన్ తీసుకునే వృద్ధులకు టీడీపీ చేసిన కుట్రలతో కష్టాలు మొదలయ్యాయి. గురువారం పింఛన్లు తీసుకునేందుకు వీరఘట్టంలో పలుచోట్ల వృద్ధులు, మహిళలు చాలా ఇబ్బందులు పడ్డారు. మండుటెండలో పింఛన్ల కోసం వేరొకరి సాయంతో సచివాలయానికి వెళ్లి అష్టకష్టాలు పడ్డారు. మండలంలో మొత్తం 10,028 మంది పింఛనుదారులు ఉండగా ఇంతవరకు 9,025 మందికి 90 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఎంవీబీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

వీరఘట్టం మేజర్‌పంచాయతీలో కొంతమంది నడవలేని వారికి, మంచం దిగలేని వృద్ధుల ఇళ్లకు వెళ్లి ఈఓ రాము పింఛన్లు పంపిణీ చేశారు. అయితే వలంటీర్లను పింఛన్ పంపిణీ చేయకుండా ఫిర్యాదు చేయించిన టీడీపీ నేత చంద్రబాబునాయుడికి వృద్ధులు, మహిళలు శాపనార్థాలు పెట్టారు.

రింగు రోడ్డుకు మోక్షం

పాలకొండ: నగరపంచాయతీలో జగన్నాథస్వామి ఆలయం వరకు ఉన్న రహదారికి మోక్షం కలిగింది. పాలకొండ పట్టణానికి ఈ రహదారి రింగ్ రోడ్డులా ఉపయోగపడుతుంది. సీతంపేట నుంచి పట్టణంలోనికి వెళ్లే ఈ రహదారిని ఎన్నో ఏళ్ల నుంచి పట్టించుకోక పోవడంతో గుంతలుగా మారింది. ప్రతిరోజూ వందలాది వాహనాలు ఈ రహదారిలో తిరుగుతుంటాయి. ఇటీవల ప్రభుత్వం రూ.80లక్షల నిధులతో ఈ రహదారి నిర్మాణం పూర్తి చేసింది. నిత్యం వరద నీరు ప్రవహించే అవకాశం ఉండడంతో సీసీ రహదారి నిర్మించారు.ఈ రహదారిలో వెళ్లే ప్రయాణికులు, వాహన చోదకుల కష్టాలు ప్రస్తుతం తీరాయి.



అధ్వానంగా ఉన్న రహదారి



నిర్మాణం పూర్తి చేసుకున్న సీసీ రోడ్డు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి గరుగుబిల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సరఫరా అవుతున్న 33 కేవీలైన్ నిర్వహణ పనులు శుక్రవారం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, వినియోగదారులందరూ సహకరించాలని ఆ శాఖ ఏఈ బి.శంకరరావు విజ్ఞప్తిచేశారు.

సింహాద్రి అప్పన్నకు పూజలు



సింహాద్రి అప్పన్న విగ్రహాన్ని తరలిస్తున్న బిత్రపాడు గ్రామస్తులు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామంలో సింహాద్రి అప్పన్న పూజలను గురువారం భక్తిశ్రద్ధలతో చేశారు. పాత బిత్రపాడు నుంచి కొత్త బిత్రపాడు గ్రామానికి సింహాద్రి అప్పన్న విగ్రహాన్ని తప్పెటగుళ్ల, మంగళవాయిద్యాలతో తిరువీధిగా తీసుకెళ్లారు. సింహాద్రి అప్పన్నను నియమనిష్ఠలతో పూజిస్తే గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నది నమ్మకమని సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామంలోని నీరస కుటుంబ సభ్యులు సింహాద్రి అప్పన్న పూజలో పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రమణ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గొరడ, రేగిడి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పాలకొండ ఆర్డీఓ వి.వి.రమణ గురువారం పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పోలింగ్ స్టేషన్ ఉండాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ బి.చంద్రశేఖర్ ఉన్నారు.

కట్టుదిట్టమైన భద్రత

కొమరాడ: పోలింగ్ కేంద్రాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తామని సీఐ కె.రవికుమార్ తెలిపారు. మండలంలోని విక్రంపురం, పరుశురాంపురం, మార్కొండపుట్టి, కళ్లికోట, దుగ్గి, శివిని తదితర గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అన్ని చోట్ల శాంతిభద్రతలను పరిరక్షిస్తామని, ప్రజలు స్వేచ్ఛగా ఓటు వేసేందుకు అవసరమైన వాతావరణం కల్పిస్తామని తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ నీలకంఠ ఉన్నారు.



విక్రంపురం పోలింగ్ స్టేషన్ వద్ద సిబ్బందికి సూచనలు చేస్తున్న సీఐ రవికుమార్

ఓటరుగా పేరు నమోదుకు అవకాశం



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్ రామరావు, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: ఓటరుగా పేరు నమోదుకు ఈ నెల 15వరకు అవకాశం ఉందని, 18 సంవత్సరాల వయస్సు నిండిన వారంతా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ బి.రామరావు కోరారు. మండంలోని ఎస్.కె పాడు గ్రామంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఓటు వజ్రాయుధం వంటిందని, ఎన్నికల్లో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీటీ రాజేంద్ర పాల్గొన్నారు.

ఒంటరిగా బీజేపీ సమావేశం

భామిని: మండల కేంద్రంలో గురువారం మిత్ర పక్షాల తోడు లేకుండా బీజేపీ ఒంటరిగా సమావేశం నిర్వహించింది. పార్టీ విస్తారక్ ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో మండల బూత్ కమిటీల సమావేశం జరిగింది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించామని బీజేపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు మండల రాంబాబు, టంకాల వాసుదేవ్‌లు తెలిపారు. సమావేశానికి మండల బూత్ కమిటీ సభ్యులు హాజరయ్యారు.

అల్లువాడలో మాట్లాడుతున్న కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు పరీక్షిత్‌రాజు



అభివృద్ధిని చూసి ఓటేయండి

- అల్లువాడలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి
- అడుగడుగునా నీరాజనం
- ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తినే సీఎంను చేద్దామని పిలుపు
- అబద్ధాలు చెప్పే టీడీపీ నేతలను నమ్మొద్దు: పరీక్షిత్‌రాజు



హాజరైన కార్యకర్తలు

జియ్యమ్మవలస: రాష్ట్రం, నియోజకవర్గంలో 58 నెలలపాటు సాగిన సంక్షేమ, అభివృద్ధి పాలనను చూసి ఓటేయాలని కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి ప్రజలను కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతీ ఇంటికీ ఆర్థిక సంక్షేమం చేకూరిందన్నారు. గిరిజన ప్రాంతాలు ప్రగతి'బాట' పట్టాయని వివరించారు. మండలంలోని అల్లువాడ గ్రామంలో వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుతో కలిసి గురువారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తొలుత చినమేరంగిలోని తమ ఇష్టదైవానికి మొక్కులు చెల్లించారు. అనంతరం అల్లువాడలో పుష్పశ్రీవాణి మాట్లాడుతూ చినమేరంగి గ్రామంలోని నా ఇల్లు మెట్టినిల్లు అయితే.. కురుపాం నియోజకవర్గంలోని ప్రతి ఇల్లూ నా పుట్టినిల్లుగా పేర్కొన్నారు. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని, అటువంటి వ్యక్తినే మరలా సీఎం చేయడానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. గడిచిన ఐదేళ్లలో జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలతో పాటు అభివృద్ధిని చేసి చూపించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి రెండోసారి జగనన్నను సీఎం చేద్దామన్నారు. నియోజకవర్గంలో ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించగలిగే సామర్థ్యం ఉందని, మన ప్రాంత అభివృద్ధి కోసం ప్రజలంతా మరోసారి తనను ఆశీర్వదించాలని కోరారు. సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు జమచేసే సరికొత్త వ్యవస్థను అందుబాటులోకి తెచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. జన్మభూమి కమిటీల పేరుతో టీడీపీ దోపిడీ పాలనకు శాశ్వత ముగింపు పలకాలని కోరారు.

- శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ ఎన్నికలు వస్తున్న తరణంలో టీడీపీ నాయకులు అబద్ధపు హామీలతో మీ ముందుకు వస్తారని, అటువంటి వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కరోనా వంటి కష్టకాలంలో కనిపించని నేతలకు ఇప్పుడు ఓటు అడిగే హక్కులేదన్నారు. నియోజకవర్గ వాసులందరూ నిజాన్ని గుర్తించి ఓటేయాలని కోరారు. అనంతరం పెదతుంబలి, జోగులడుమ్మ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు, గరుగుబిల్లి మండల ఎంపీపీ ఉరిటి రామారావు, గుమ్మలక్ష్మీపురం మండల ఎంపీపీ ధీనమయ్య, కొమరాడ ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ సభ్యుడు ద్వారపురెడ్డి లక్ష్మి, కొమరాడ మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దననాయుడు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్ బాబు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు దాసరి శ్రీధర్, కురుపాం ఎంపీపీ శెట్టి పద్మావతి, డీసీసీబీ డైరెక్టర్ లోలుగు నారాయణరావు, పార్వతీపురం మన్యం జిల్లా జేసీఎస్ కోఆర్డినేటర్ వి.టి.సూర్యనారాయణ థాట్రాజ్, మాజీ ఎంపీపీ గూనగంజి చంద్రయ్య, వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, సీనియర్ నాయకులు శెట్టి నాగేశ్వరరావు, దేవకొడ తిరుపతి నాయుడు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామాల్లో పోలీస్ కవాతు



వెలగవాడలో కవాతు చేపడుతున్న సాయుధ బలగాలు, ఎస్సై

పాలకొండ రూరల్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ముందస్తు చర్యలపై దృష్టి పెట్టారు. ఈ మేరకు ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులు అంచనా వేసే యంత్రాంగం గురువారం ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ నేతృత్వంలో సాయుధ బలగాలతో వెలగవాడ, సింగన్నవలస తదితర గ్రామాల్లో ప్రత్యేక కవాతు చేపట్టాయి. ఎన్నికల నిబంధనలు అతిక్రమించవద్దని, యువత ఘర్షణలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాలలో మండలంలో సమస్యాత్మక ప్రాంతాలు, గతంలో జరిగిన ఎన్నికల నేపథ్యంలో కేసుల్లో చిక్కుకున్న వారిపై, నేరప్రవృత్తి కలిగిన వారిపై ప్రత్యేక్య దృష్టి పెడుతున్నామని ఎస్సై తెలిపారు.

కొనసాగిన పండుటాకుల పింఛన్ కష్టాలు



బిల్లుమడలో కిక్కిరిసిన గదిలో పింఛన్ల పంపిణీ

భామిని: మండలంలో గురువారం వైఎస్సార్ పింఛన్ కానుక అందుకునేందుకు వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు నానా అవస్థలు పడ్డారు. మండలానికి మంజూరైన మొత్తం 7,109 పింఛన్లకుగాను రూ.2,11,28,500లు విడుదలైంది. మొత్తం 16 సచివాలయాల పరిధిలో గురువారం సాయంత్రానికి 5,350 మందికి రూ.1,63,62 పింఛన్ల కింద అందజేశారు. వేసవి తీవ్రత కారణంగా ఉదయం నుంచే కార్యాలయాల దగ్గరకు దేక్కుంటూ దూర ప్రాంతాల నుంచి లబ్ధిదారులు తరలివచ్చారు. గ్రామ సచివాలయం ఉద్యోగులు, పింఛన్లు అందించడానికి నానా అవస్థలు పడ్డారు. కార్యాలయం గదులు కిక్కిరిసిపోయాయి. కొన్ని దూర గ్రామాలకు సచివాల య సిబ్బంది సాయంత్రం వెళ్లి పింఛన్లు అందజేశారు. నేరడి-బి సచివాలయం సిబ్బంది గురండి గ్రామానికి వెళ్లి చెట్ల కింద పంపిణీ చేశారు. కాట్రగడ-బి సిబ్బంది మనుమకొండ వెళ్లి గిరిజనులకు పెన్షన్లు అందజేశారు. నులకజోడు ఉద్యోగులు బిల్లుమడలో గల హెల్త్‌క్యాంప్‌లో పింఛన్లు అందజేశారు.

విజయపథంలో నడిపించు రామా..!



రామాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: మండలంలోని యు.వెంకమ్మపేట పంచాయతీ పరిధి జోగింపేటలో రెండు రోజుల క్రితం నూతనంగా నిర్మించిన రామాలయాన్ని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో వెలసిన సీతారాముల చిత్రపటాల వద్ద పూజలు చేశారు. శ్రీరామచంద్ర ప్రభూ..మమ్మల్ని విజయపథంలో నడిపించు స్వామీ అని కోరుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, చిదిమి, యు.వెంకమ్మపేట సర్పంచ్‌లు దమలపాటి ఉమా మహేశ్వరరావు, శొంట్యాన లక్ష్మి, సింహాచలం, వారాడ శ్రీరాములునాయుడు తదితరులు ఎమ్మెల్యే కళావతి వెంట ఉన్నారు.